క్లుప్తంగా

రోజుకు రూ.300 సంపాదించాలి



సాంగ్విలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీవో

కెరమెరి: పని చేసే ప్రతీ కూలీ రోజుకు రూ.300 సంపాదించాలని ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. మండలంలోని సాంగ్వి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఎండల నేపథ్యంలో ఉదయం, సాయంకాలం పనులు చేయాలని కూలీలతో పేర్కొన్నారు. కొలతల ప్రకారం లోతు, వెడల్పు తవ్వాలని ఆయన పేర్కొన్నారు. జాబ్‌కార్డు కలిగి పనిచేయకుండా ఇళ్లల్లో ఉండే కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో టెంట్, తాగునీరు. ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉంచేలా చూస్తామని పేర్కొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత



మాట్లాడుతున్న ఎస్సై మధుకర్

కెరమెరి: మండలంలోని సాంగ్వి గ్రామంలో బుధవారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, షీటీమ్స్, గంజాయి నివారణపై అవగాహన, సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై ఆటపాటల ద్వారా కళాకారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మధుకర్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదన్నారు. ప్రభుత్వం, పోలీసుల తరఫున సహకారమందిస్తామని పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వాలన్నారు. డయల్ 100, సైబర్ క్రైమ్, బ్లాక్ మ్యాజిక్ తదితరాలపై అవగాహన కల్పించారు.

నేడు సామాజిక ప్రజావేదిక

చింతలమానెపల్లి: ఉపాధిహామీ పథకంలో భాగంగా 2024 –25 మార్చి వరకు మండలంలో నిర్వహించిన ఉపాధిహామీ పనులపై శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక ప్రజావేదికకు ఉపాధి సిబ్బందితో పాటు మండలంలోని కూలీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

షీటీం సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: షీటీం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని షీటీం సభ్యురాలు స్వప్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ తీసుకుంటున్న టీచర్లకు షీటీంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు అండగా ఉంటామని, భద్రత కల్పిస్తామన్నారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థుల ప్రవర్తన గమనిస్తూ ఉండాలని, సహ ఉపాధ్యాయులు ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించిన సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు రజిత, దినేశ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ఆసిఫాబాద్‌అర్బన్/రెబ్బెన: మండలంలోని కొండపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నమ్రతను సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందిరానగర్‌లో పని చేస్తున్నప్పుడు ఇద్దరు పెన్షన్‌దారులు మృతి చెందినప్పటికీ బయోమెట్రిక్ ద్వారా వారి పెన్షన్ డబ్బులు డ్రా చేసినట్లు ఫిర్యాదు రావడంతో విచారణ చేపట్టారు. విచారణలో ఇందిరానగర్ గ్రామానికి చెందిన ఒకరి వృద్ధాప్య పెన్షన్‌ను 14 నెలలు, మరో దివ్యాంగుడి పెన్షన్‌ను 12 నెలల పాటు డ్రా చేసినట్లు విచారణలో తేలింది. లబ్ధిదారులు మృతి చెందినప్పటికీ వారికి మంజూరైన పెన్షన్ డబ్బులను డ్రా చేసినట్లు తేలడంతో సస్పెండ్ చేశారు.

కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలి

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం మధ్యాహ్నం 1గంటకు నిర్వహించే భూభారతి చట్టం 2025 అవగాహన సదస్సు కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు సముద్రాల రాజన్న పిలుపునిచ్చారు. సమావేశానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క హాజరుకానున్నట్లు తెలిపారు.

యువవికాసానికి 'సిబిల్' మెలిక



రుణాల కోసం దరఖాస్తు చేస్తున్న యువకులు(ఫైల్)

- ఈఎంఐలు సరిగా ఉంటేనే ఒకే
- ఆందోళన చెందుతున్న దరఖాస్తుదారులు

కెరమెరి: రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ప్రభుత్వం కల్పిస్తున్న రుణాల కోసం ఎంతో ఆతృతతో ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులకు ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలను మంజూరు చేస్తామని చెప్పడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. దీని వల్ల గతంలో రుణాలు తీసుకుని చెల్లించకుండా ఎగవేతకు పాల్పడిన వారికి భారీ షాక్ తగలనుంది.

1757 దరఖాస్తులు..

మండలంలోని 31 గ్రామ పంచాయతీలలో 1757 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో బీసీ వర్గానికి చెందిన లబ్ధిదారులు 625, ఎస్సీ 203, ఎస్టీ 708, మైనార్టీ 205, క్రిస్టియన్ 01, ఈబీసీ 05 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే రుణ యూనిట్లు మాత్రం తక్కువగా మంజూరు కావడంతో అదృష్టం ఎవరిని వరిస్తుందో తెలియని వైనంగా మారింది. ఎస్సీలకు 92 యూనిట్లు మంజూరు కాగా, ఎస్టీలకు 398, మైనార్టీలకు 30, క్రిస్టియన్‌లకు 1, ఈబీసీలకు 2 యూనిట్లు మంజూరయ్యాయి. బీసీ యూనిట్ల లెక్కలు ఇంకా తేలలేదు. రూ. 50 వేల వరకు వంద శాతం రాయితీ ఉండగా రూ. 50 వేల నుంచి రూ. 1లక్ష వరకు 90 శాతం రాయితీ, రూ.1 నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం, రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం రాయితీపై రుణాలు పొందవచ్చు. గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 వరకు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షల వరకు కుటుంబ ఆదాయం పరిమితి ఉండాలి. కాగా రూ.50 వేల వరకు ప్రభుత్వమే వంద శాతం రాయితీపై రుణాలు మంజూరు చేయనుండగా, రూ.50 వేలకు మించిన రుణాలను బ్యాంకుల ద్వారా అందించనున్నారు.

బకాయిలు ఉంటే..

గతంలో ఏదైనా రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించకుంటే సిబిల్ స్కోర్ తగ్గుతుంది. దాని ప్రకారం ఎవరికైతే సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటుందో వారి దరఖాస్తులు తిరస్కరణకు గురవుతాయి. ఈ మేరకు ఈ నెల 2 నుంచి 12 వరకు దరఖాస్తుదారుల అప్లికేషన్లు ఎంపీడీవో కార్యాలయంలో పరిశీలించారు. గత సిబిల్ ట్రాక్‌ను సేకరించేందుకు ఎస్‌బీఐ అడ, కెరమెరి గ్రామీణ బ్యాంకు అధికారులకు దరఖాస్తులను పంపించారు. సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలను అందిస్తే ఎస్టీ మినహా ఇతర కేటగిరిల్లో 40 శాతం అభ్యర్థుల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. గత ప్రభుత్వాలు నిరుద్యోగులు ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతో ఆయా కార్పొరేషన్‌ల ద్వారా రుణాలను అందించేవి. రాయితీ సొమ్ము మినహా బ్యాంకులు అందించిన రుణాలు తిరిగి చెల్లించాల్సి ఉండేది. అవి చాలా వరకు చెల్లించకపోవడంతో సిబిల్ స్కోర్ మెలిక పెట్టినట్లు తెలుస్తోంది.

బ్యాంకులకు పంపించాం..



రాజీవ్ యువ వికాసం ఆధ్వర్యంలో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 12 వరకు పరిశీలించాం. సిబిల్ స్కోర్ తెలుసుకునేందుకు ఆయా బ్యాంకు అధికారులకు అందజేశాం. ఇప్పటి వరకైతే సిబిల్ స్కోర్ ఆధారంగానే రుణాలు అందించే అవకాశం ఉంది. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అర్హులైన వారికి రుణాలు అందిస్తాం.
– అంజద్ పాషా, ఎంపీడీవో

ముగిసిన సమ్మర్ క్యాంపు

- ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగిన శిక్షణ శిబిరాలు
- ఈనెల 1న ప్రారంభం



బూర్గుడ పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 1 నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరాలు గురువారం ముగిసినట్లు ఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు విద్యాశాఖ ఈ వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహించి ఆటలు నేర్పించారు. జిల్లాలోని 50 ఉన్నత పాఠశాలల్లో 15 రోజుల పాటు క్యాంపులు నిర్వహించారు.

15 రోజులపాటు..

విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా పలు రకాల స్కిల్స్ నేర్పించాలనే ఉద్దేశంతో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. 15 రోజుల పాటు పాఠశాలల్లో సందడి నెలకొంది. విద్యార్థులకు చదువుతో పాటు స్కిల్స్‌పై ఆసక్తి కలిగించేందుకు ఈ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రతీరోజు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు పిల్లలకు ఇండర్ గేమ్స్, డ్యాన్స్, క్యారం, కరాటే, చెస్, వంటి ఆటలు, పాటలు నేర్పించారు. సమ్మర్ క్యాంపు నిర్వహణ కోసం ఒక్కో పాఠశాలకు రూ.50 వేలు చొప్పున ఖర్చు చేశారు.

డ్యాన్స్ నేర్చుకున్నా..



మా పాఠశాలలో 15 రోజుల పాటు డ్యాన్స్ మాస్టర్ శ్రీకాంత్ డ్యాన్స్ నేర్పించారు. నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. 15 రోజులు తెలియకుండానే గడిచిపోయాయి. – శ్రీకన్య, బూర్గుడ

కరాటే నేర్చుకున్నా..



చిన్నతనం నుంచి కరాటే నేర్చుకోవాలని ఉంది. ఈ సంవత్సరం మా పాఠశాలలో వేసవి సెలవుల్లో క్యాంపు నిర్వహించడంతో ఉచితంగానే కరాటే నేర్చుకున్నాను. – హరీశ్, బూర్గుడ

బహుమతులు అందజేత..



బహుమతులు అందజేస్తున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 1 నుంచి ప్రారంభమైన సమ్మర్ క్యాంపులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా మండలంలోని గోయగాం ఉన్నత పాఠశాలలో శిక్షకులు ప్రత్యేక ముగింపు కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులతో ఆటలు ఆడించారు. చెస్, క్యారం, స్కిప్పింగ్, డ్రాయింగ్ తదితరాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో ఆడే ప్రకాశ్ బహుమతులు అందజేశారు.

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సమ్మర్ క్యాంపు ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. గత 15 రోజుల నుంచి నిర్వహించిన సమ్మర్ క్యాంపు కార్యక్రమాలను విద్యార్థులు వేదికలపై చేసి చూపించారు. ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉపాధ్యాయులు ఇందారపు ప్రకాశ్, ఏఏపీసీ చైర్మన్ పంబాల రేణుక, డ్యాన్స్ మాస్టర్ రాజ్‌కుమార్, వీవీలు సాయి, కృష్ణ, జీశాన్, మొగిలి విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో హైలెవల్ వంతెన పనులు



హైలెవల్ వంతెన నిర్మించాల్సిన ప్రదేశం



పనుల శిలాఫలకం

- గత ఏడాది శంకుస్థాపన చేసిన ప్రజాప్రతినిధులు
- సీఆర్ఐఎఫ్ కింద రూ.18 కోట్లు మంజూరు

దహెగాం: దహెగాం –పెంచికల్‌పేట్ మండలాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో పెద్దవాగుపై హైలెవల్ వంతెన, అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం గత సంవత్సరం సీఆర్ఐఎఫ్ కింద రూ. 18 కోట్లు మంజూరయ్యాయి. గత సంవత్సరం అక్టోబర్‌లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్‌లు కలిసి పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. అయినా ఇప్పటికీ వంతెన పనులు ప్రారంభం కాలేదు. దీంతో వర్షాకాలంలో మళ్లీ బురద కష్టాలు తప్పవంటూ స్థానికులు వాపోతున్నారు.

నిధులు మంజూరు..

దహెగాం –పెంచికల్‌పేట్ మధ్యలో ఉన్న పెద్దవాగుపై వంతెన గత రెండు సంవత్సరాల క్రితం పూర్తయింది. రెండు వైపులా అప్రోచ్ రోడ్డు పూర్తి కాలేదు. గత రెండు నెలల క్రితం పెంచికల్‌పేట్ వైపు అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించారు. కంకర పోసి వదిలేశారు. లగ్గాం వైపు పనులు ఇంకా ప్రారంభం కాలేదని పలువురు వాపోతున్నారు. అప్రోచ్ రోడ్డు మట్టితో ఉండడంతో వర్షాకాలంలో రోడ్డు బురదగా మారి రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తుందని వాపోతున్నారు. మరో చోట చిన్న వంతెన ఉండడంతో హైలెవల్ వంతెన నిర్మించాల్సి ఉండగా పనులు ప్రారంభం కాలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హైలెవల్ వంతెన నిర్మాణం, అప్రోచ్ రోడ్డు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

25న కోనేరు అభిమానుల ఆత్మీయసభ



మాట్లాడుతున్న నాయకులు

బెజ్జూర్: చింతలమానెపల్లి మండల కేంద్రంలో ఈనెల 25న సాయంత్రం 5 గంటలకు కోనేరు అభిమానుల ఆత్మీయసభ నిర్వహించనున్నట్లు మండల నాయకులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సభలో ప్రస్తావించనున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి వారసంత రద్దు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లిలో గ్రామంలో శుక్రవారం జరిగే వారసంత తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కుకిడే చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా గడ్‌బోరికర్ పెర్సాపెన్ పూజలు



పూజలు చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

నార్నూర్: వైశాఖమాసం సందర్భంగా ఆదివాసీ గిరిజనులు గడ్ బోరికర్ పెర్సాపెన్ పూజను గురువారం మండలంలోని ధానుగూడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. పెర్సాపెన్‌ను గ్రామంలో ఊరేగించారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి కోసం బేతల్క్ దేవుడి వద్దకు వెళ్లి మొక్కు చెల్లించి తుంక్ కార్యక్రమం నిర్వహించారు. తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, గాడ్ బోరికర్ పెర్సాపెన్ కటోడ పెందూర్ భీంరావు, పెస్ పటేల్ పెందూర్ మాధవరావు, యాదవరావు, గ్రామ పటేల్ రఘు, మాజీ ఎంపీటీసీ పెందూర్ సోనేరావు పాల్గొన్నారు.

ఫుడ్ బాస్కెట్ పంపిణీ

జైనథ్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మండలంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు ఫుడ్ బాస్కెట్ పంపిణీ చేశారు. డాక్టర్ నయనతా ఉన్నారు.

'కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న కేంద్రం'



మాట్లాడుతున్న పేరం శ్రీనివాస్

రెబ్బెన: కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థకు ఊడిగం చేస్తోందని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అన్నారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం 4 కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. దాంతో కార్మిక వర్గానికి హక్కులు లేకుండా పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. సమావేశంలో సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ప్రకాశ్‌రావు, నాయకులు రామారావు, హుస్సేన్, మాదవ కృష్ణ, శ్రీనివాస్, గట్టయ్య, రాజేశం, భీమేశ్, ప్రభాకర్, వినయ్, రామ్మోహన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతులు పూలే దంపతులు



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే ఆదర్శ దంపతులని మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యామ్‌రావు అన్నారు. గురువారం మండలంలోని కన్నెపల్లి ఎక్స్‌రోడ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను మాలి సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మాలి కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వం మా లీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు నాగోసే విశ్వనాథ్, మందాడే కల్పన పూలే దంపతుల వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు నాందేవ్, ప్రధాన కార్యదర్శి నికోడే గంగారం, నాయకులు ఆదే శ్రీనివాస్, రమేశ్, దుర్గం మోతిరాం, మోర్లె పాండురంగ్, హన్మంతు, ముక్తేశ్వర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'లంబాడీలపై సవతి తల్లి ప్రేమ'



మాట్లాడుతున్న భరత్ చౌహాన్

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో లంబాడీలపై రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు భరత్ చౌహాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీ సేవాలాల్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ లంబాడీలకు కులధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు అధికారులు ఇష్టారీతిన నిబంధనలు విధించడం సరికాదన్నారు. భవిష్యత్తులో లంబాడీలపై వివక్ష చూపిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్, సేవాలాల్ మహరాజ్ ఉత్సవ సమితి ఉట్నూర్ అధ్యక్షుడు జాదవ్ మధుకర్, నాయకులు అడే డిగాంబర్, కైలాస్‌నాయక్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత, సుస్థిర వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజశేఖర్

బేల: రైతులు సమీకృత, సుస్థిర వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాజశేఖర్, శివచరణ్‌లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని చప్రాల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చెరువు మట్టి, పశువుల పెంట, వర్మి కంపోస్టు, వేపనూనె, వేపపిండి, జీవ సంబంధ పురుగు మందులు ట్రైకోడెర్మా వెరిడి, రైజోబియం, పీఎస్‌బీ, లింగాకర్షక బుట్టలు, పసుపు నీలిరంగు జిగురు అట్టలు, అంతర పంట, పంట అవశేషాలను భూమిలో కలియ దున్నడం, పంట నిల్వలు వంటి అంశాలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి సాయి తేజరెడ్డి, మండల పశు వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, సీపీఎఫ్ స్వచ్ఛంద సంస్థ అధికారి సత్యనారయణ, ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులు పాటించాలి

సిరికొండ: వ్యవసాయంలో సేంద్రియ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ కళాశాల డీన్ శాస్త్రవేత్త శ్రీధర్ అన్నారు. మండలంలోని లచ్చింపూర్ గ్రామంలో రైతువేదికలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త మురళీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కుమారస్వామి, వ్యవసాయాధికారి శ్రద్ధ రాణి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు దీపక్, మాజీ ఎంపీపీ పెందుర్ అమృత్‌రావు, మాజీ గ్రామ సర్పంచ్ నర్మద, రైతులు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు అందజేస్తున్న ఎస్సై ప్రవీణ్

బెజ్జూర్: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బెజ్జూర్ ఎస్సై కొట్టే ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని గిర్రిగూడ గ్రామంలో గిరగూడ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తి చాటుతూ గ్రామీణ ప్రాంత యువత ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. క్రీడలతో పాటు చదువుపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యంగా ఉంటారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ 15 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయన్నారు. మర్తిడి, గిర్రిగూడ జట్లు ఫైనల్‌కు వెళ్లగా హోరాహోరీ పోరులో గిర్రిగూడ జట్టు గెలుపొందిందని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ ట్రేడర్స్ ప్రొప్రైటర్ అమీరుద్దీన్, సోమిని మాజీ ఉప సర్పంచ్ దుర్గం శంకర్, గ్రామస్తులు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'దుకాణాలు తొలగించాలి'

ఉట్నూర్‌రూరల్: నాయీబ్రాహ్మణులం కుల వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నామని ఇతరులు వేరే రాష్ట్రాల నుంచి వచ్చి దుకాణాలు పెట్టడంతో ఉపాధి దొరకకుండా పోతుందని నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఉట్నూర్ మండల అధ్యక్షుడు గర్షకుర్తి వెంకటేశ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఇతరుల దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం

సాత్నాల: విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. భోరజ్ మండలంలోని జెడ్పీఎస్ఎస్ గిమ్మ పాఠశాలలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారులు పాల్గొంటున్నారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు శిక్షణ శిబిరంలో డాన్స్, యోగా, మ్యూజిక్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చెస్, క్యారం, స్కిప్పింగ్, స్నేక్ అండ్ లాడర్ వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్ట్ టీచర్ వినోద్, క్రాఫ్ట్ టీచర్ మనోహర్, ఉపాధ్యాయుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ముఖిడే ఉత్తం



ఎస్పీని సన్మానిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ ముఖిడే ఉత్తం, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గురువారం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి ఎస్పీ అఖిల్ మహాజన్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఇంద్రవెల్లి మండలకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ మసూద్ తదితరులు ఉన్నారు.